క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా రామకృష్ణ

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి (యాక్టివిటీ)గా రాప్తారి రామకృష్ణ నియమితుల య్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది.

ప్రమాదాల నివారణకు అధికారుల చర్యలు

రౌతులపూడి: యువకులు స్నానాలకు వెళ్లి మరణిస్తున్న ఘటనలు ఇటీవల విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోని గురువారం మండలంలోని ప్రధాన కాలువులు, చెరువుల వద్ద ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలు మేరకు తహశీల్దార్ నరేష్ ఆధ్వర్యంలో రౌతులపూడి శివారు ఏలేరు ఎడమ కాలువ వద్ద ప్రమాదాలను నివారించేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కాలువలు, చెరువుల్లో స్నానాలు కోసం, ఈతకు దిగి తరచూ ప్రమాదాల జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారన్నారు. లోతు ఎక్కువగా వుండే కాలువులు, చెరువుల పూడికలో చిక్కుకుపోయి ప్రమాదాలు జరగకుండా ప్రజలంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓలు సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలి



తుని గొల్ల అప్పారావు సెంటర్లో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

తుని: మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ కోసం ప్రజలు ఏకతాటిపై నడవాలని సీపీఎం నాయకుడు ఎస్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం గొల్ల అప్పారావు సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యత ర్యాలీ నిర్వహించారు. పహల్గామ్ ఉగ్రదాడిలో అసువులు భాసిన భారతీయులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ..తీవ్రవాదం, మతోన్మాదం దేశానికి ప్రమాదకరమన్నారు. తీవ్రవాదానికి కులం, మతం లేదని విశ్వజన వినాశనమే ఉగ్రవాదులు కోరుకుంటున్నారని, పహల్గాం ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాకిస్తాన్ గూఢచారి మల్హోత్రా యూట్యూబ్ ఛానల్ ద్వారా భారతదేశ రహస్యాలను చేవేస్తోందన్నారు. దేశ రక్షణకు భంగం కలిగించేటువంటి చర్యలకు పాల్పడిన వాళ్లను కఠినంగా శిక్షించాలని కోరారు. సాత్యకాదేవి, సయ్యద్ ఖాసిం, రామచంద్రరావు, గొర్ల రమణ పాల్గొన్నారు.

31న పింఛన్ల పంపిణీ

శంఖవరం: మండల వ్యాప్తంగా ఈ నెల 31న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు సక్రమంగా పింఛన్లు పంపిణీ చేసేలా గ్రామ కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూన్ 1 ఆదివారం సెలవు దినం కావడంతో 31న పింఛన్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. దానికి అనుగుణంగా ముందస్తుగా సిబ్బంది ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

జూదరులపై కేసు

గోకవరం: బొమ్మ బొరుసు ఆడుతున్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు గురువారం ఎస్సై వీఎన్‌వీ పవన్ కుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు మండలంలోని కొత్తపల్లి శివారులో బొమ్మ బొరుసు ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి జరిపి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 2,000 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా జూదం ఆడినా, నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



సభ్యుల ప్రశ్నలకు వివరణ ఇస్తున్న అధికారులు

ఏలేశ్వరం: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో గురువారం పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సభ్యులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంతో నామమాత్రంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీలోని ప్రతివార్డులో అభివృద్ధి జరిగేలా సమానంగా నిధులు కేటాయించాలని 3వవార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు, 4వవార్డు కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి సూచించారు. అనంతరం నగర పంచాయతీ అజెండాను కౌన్సిల్లో చదివి వినిపించారు. కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ, టీపీఓ ఆనంద్‌కుమార్. ఏఈ అనూష, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న కుమ్మరిలోవ

- స్థలాల కేటాయింపులో అక్రమాలు
- తవ్వకాలతో స్థానికుల భయాందోళన
- జాబితాలో అనర్హులకు చోటు



కాలువ కోసం తొలగించనున్న కుమ్మరిలోవ కాలనీ ఇళ్లు

తుని రూరల్: పోలవరం కాలువ నిర్వాసితులకు ఇళ్లస్థలాలు కేటాయింపులో పారదర్శకత పాటించ లేదని, ఆరోపిస్తూ కుమ్మరిలోవ కాలనీవాసులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. గురువారం దుద్దికలోవలో జరుగుతున్న ఇళ్లస్థలాల అభివృద్ధి పనులు అడ్డుకునేందుకు సిద్ధమైన బాధితులకు పెద్దాపురం ఆర్డీఓ నుంచి సమాచారం రావడంతో ఆందోళనను వాయిదా వేసుకున్నారు. ఆర్డీఓతో జరిగిన చర్చలపై బాధితులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తామని, అప్పటికి తమకు న్యాయం జరక్కపోతే పోరాటం చేసేందుకు వెనుకాడబోమని స్పష్టం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

పోలవరం ఎడమ ప్రధాన కాలువ తుని మండలం కుమ్మరిలోవ కాలనీపై నుంచి ప్రవాహిస్తోంది. దీంతో కాలువ తవ్వకానికి అనువుగా కాలనీలో ఇళ్లను భూసేకరణ చేశారు. 2018లో కుమ్మరిలోవకు సమీపంలో దుద్దికలోవ ప్రాంతంలో ఒక్కొక్కరికి మూడు సెంట్లు ఇళ్ల స్థలం, ఆర్అర్ ప్యాకేజీని అందజేశారు. అక్కడ భూసేకరణ చేసిన రైతులకు స్థలాలు ఇవ్వాలని, భూసేకరణ ధర పెంచాలని కొంతమంది కోర్టును ఆశ్రయించారు. దాంతో ఆ ప్రాంతంలో నిర్వాసితులు ఇళ్లను నిర్మించుకోలేదు. కాగా ఇటీవల ప్రభుత్వం ఐదు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రకటించి, అందుకు అనుగుణంగా దుద్దికలోవలో లేఅవుట్ వేశారు. 2018లో 472 మందికి కేటాయించిన స్థలాలను ఐదు సెంట్లుగా మార్పు చేయడంతో కొంతమందికే సరిపోతుంది. దీంతో చేపూరు వద్ద మరో లే అవుట్‌ను సిద్ధం చేశారు. దుద్దికలోవలో 272, చేపూరులో 200 మంది వరకు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో చేపూరులో నివాసం ఏర్పాటు చేసుకునే వారు స్వచ్ఛందంగా లేఖలు ఇవ్వాలని అధికారులు కోరడంతో 120 మంది లేఖలు ఇచ్చారు. లేఖలు ఇవ్వని నిర్వాసితులంత కుమ్మరిలోవ సమీప దుద్దికలోవలో నివాసం ఉంటామని పేర్కొన్నారు. దుద్దికలోవలో నిర్వాసితుల ఇళ్లస్థలాలు కేటాయింపునకు బుధవారం రెవెన్యూ కార్యాలయంలో లబ్ధిదారుల సమక్షంలో తహసీల్దార్ లాటరీ పద్ధతి నిర్వహించారు. ముందుగా చేపూరు వెళ్తామని అంగీకరించిన కొంతమందికి దుద్దికలోవలో స్థలాలు లభించడం, దుద్దికలోవలోనే నివాస స్థలం కావాలన్న కొంత మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించకపోవడంతో సమస్య జటిలమయ్యింది. ఆర్ఆర్ ప్యాకేజీ, గతంలో ఇళ్లస్థలం కేటాయించని కొంతమంది పేర్లు ఇళ్లస్థలాల జాబితాలో ఉండటంపై నిర్వాసిత బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొంత మంది తమ కుటుంబాల్లో ఒకరికి ఒకచోట మరొకరికి మరోక చోట ఇళ్లస్థలాలు కేటాంచడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలోనే స్థలం కేటాయించాలి



కుమ్మరిలోవ పరిధిలోని మా తల్లికి ఇంటి స్థలం కేటాయించారు. గతంలో నా కుటుంబానికి ఇక్కడే స్థలం కేటాయించారు. మా కుటుంబానికి ఇక్కడే స్థలం ఇస్తే తల్లికి అందుబాటులో ఉంటూ పుట్టిన ఊరులో పనులు చేసుకుంటు జీవనం సాగిస్తాం. ఎక్కడో స్థలం కేటాస్తే అంగీకరించలేను.

–గల్లి నాయకులు, నిర్వాసితుడు

భయం భయం



ఇళ్లస్థలాలు కేటాయిస్తే పాకో పందిరో వేసుకుని ఇల్లు ఖాళీ చేసేస్తాం. ఇంట్లో నివాసం ఉంటుండగానే కాలువ తవ్వకం పనులు చేస్తుండటంతో బండరాళ్లు వచ్చిపడుతున్నాయి. దీంతో బాంబులు పేలినప్పుడల్లా ఏ రాయి వచ్చి పడుతుందోనని భయం భయంగా జీవిస్తున్నాం. ఇల్లు ఖాళీ చేసేవరకు పనులు ఆపాలి.

– దుంగల లక్ష్మి, నిర్వాసితురాలు



నిర్వాసితులకు సిద్ధం చేస్తున్న ఇళ్లస్థలాలు



కాలువ తవ్వకంతో ఇళ్లపైకి వచ్చిపడుతున్న బండరాళ్లు

దూసుకువస్తున్న బండరాళ్లు

డిసెంబరు నాటికి పోలవరం కాలువ పూర్తి చేయాలన్న ఆతృతలో కాంట్రాక్టర్ కుమ్మరిలోవ కాలనీని ఆనుకుని ఉన్న కొండపై పనులు చేస్తున్నారు. మందుగుండు పేల్చుతుండటంతో బండరాళ్లు ఎగిరి ఇళ్లమధ్యలోకి దూసుకువస్తున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థలాలు కేటాయించి ఐదారు నెలలు గడువు ఇస్తే ఇళ్ల ఖాళీ చేసి వెళ్లిపోతామని నిర్వాసితులు వాపోతున్నారు. కాపురాలు ఉంటున్న ఇళ్లపై బండరాళ్లు పడి ప్రమాదం సంభవిస్తే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి తమ గోడు వినాలని కోరుతున్నారు. అక్రమాలకు తావేలేదని, పారదర్శకంగా ఇళ్లస్థలాలు కేటాయించినట్టు తహసీల్దార్ ప్రసాద్ పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉంటే అప్పీల్ చేసుకోవచ్చన్నారు.

మర్యాదపూర్వకంగా..



మాజీ మంత్రి తోట నరసింహాన్ని సత్కరిస్తున్న గోరంట అబ్బులు

కిర్లంపూడి: జగ్గంపేట నియోజకవర్గానికి సంబంధించిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రి, నియోజకవర్గం కో–ఆర్డినేటర్ తోట నరసింహాన్ని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు గండేపల్లి మండలంలోని రామేశరంపేట గ్రామానికి చెందిన గోరంట అబ్బులు, కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ సెక్రటరీగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరవరంలోని తోట నరసింహం నివాసానికి వెళ్లి ఆయనను, తోట రాంజీని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని, కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.

రీ సర్వేపై నిర్లక్ష్యం తగదు

తొండంగి: మండలంలో రీసర్వేకు సంబంధించి వీఆర్వోలు, సర్వేయర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మురార్జీ ఆగ్రహం వ్యక్తం చేసారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్షించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని బెండపూడి తదితర ప్రాంతాల్లో రీసర్వే త్వరితగతిన పూర్తి చేయాలని 17 టీమ్‌లను ఏర్పాటు చేశారు. సర్వే ప్రక్రియ నత్తనడకన నిర్వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వెన్నుపోటు ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



లచ్చిరెడ్డిపాలెంలో మండల నాయకులతో సమావేశమైన కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును సత్కరిస్తున్న లచ్చిరెడ్డిపాలెం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

రౌతులపూడి: ఏడాది కాలంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించి వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వానికి ప్రజలంతా బుద్ధి చెప్పాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సూరెడ్డి తిరుములరాయల్ సాయి అధ్యక్షతన మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామంలో తొలిసారిగా పర్యటించిన ముద్రగడను గ్రామంలోని పార్టీ నాయకులు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలసి తమ ఆత్మీయతను పంచుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని గాలికొదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు, నాయకులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం సరికాదన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలను ఇచ్చి గద్దెనెక్కిన ప్రస్తుత ప్రభుత్వానికి ప్రజలంతా త్వరలో తగిన బుద్ధి చెబుతారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త మీద ఉందన్నారు.

జూన్ 4న వెన్నుపోటు దినం

దీనిలో భాగంగానే పార్టీ అధిష్టానం పిలుపు మేరకు జూన్ నాలుగో తేదీన జిల్లా, నియోజకవర్గ స్థాయిలో జరిగే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో ప్రజలంతా భారీగా తరలివచ్చేందుకు పార్టీ శ్రేణులంతా కృషిచేయాలన్నారు. రానున్న రోజుల్లో ప్రతి కార్యకర్త క్షేత్ర స్థాయిలో పర్యటించి పార్టీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. మరలా మన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుని తిరిగి రాజన్న రాజ్యాన్ని తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు అంగూరి లక్ష్మీశివకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, పార్టీనేత వాసిరెడ్డి భాస్కరబాబు, మండల పార్టీ కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ,గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, స్థానిక నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరకలెత్తుతున్న తాండవ



తాండవ మినీ రిజర్వాయర్‌లో ప్రవహిస్తున్న వర్షపు నీరు

తుని రూరల్: తాండవ నదీ పరివాహక ప్రాంతంలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కొత్తనీరు చేరింది. దీంతో తునికి ఎగువన, దిగువన ఉన్న రెండు మినీ రిజర్వాయర్ల కట్టడాలపై నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. గురువారం ఎర్రటి కొత్తనీరు ప్రవహిస్తుండడంతో రైతులు ఉత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పొలాలను దుక్కిదున్నడానికి సన్నద్ధమవుతున్నారు. ఇదేవిధంగా వర్షాలు కురిస్తే ఖరీఫ్ పంటలకు అవసరమైన సాగునీరు అందుతుందని తద్వారా అధిక దిగుబడులు వస్తాయని రైతులు తెలిపారు.

ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ సురేష్

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో గురువారం వైఎస్సార్ సీపీ మండల శ్రేణుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ గొల్లపల్లి సురేష్, సీనియర్ నేత గొల్లపల్లి కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. గ్రామ కమిటీలు, మండల కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో మళ్లీ అధికారం సాధించడమే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. అనంతరం పార్టీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు నాయకత్వంలో పార్టీ విజయమే లక్ష్యమని తీర్మానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యిజనగిరి ప్రసాద్, గుమ్ములూరి వెంకటరమణ, బులిపే దేవి, అల్లం ఆదినారాయణ, పల్లెల బ్రహ్మాజీ, ములగపాటి రమేష్‌రాజు, కొండపల్లి వెంకటేశ్వరరావు, బందెల అంకాలు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం



యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న, శంఖవరం అధికారులు



కోటనందూరులో యోగాపై అధికారుల అవగాహన ర్యాలీ

శంఖవరం: యోగాంధ్రాలో భాగంగా ఎంపీడీఓ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రం శంఖవరంలో అధికారులు మానవహారం చేపట్టారు. ప్రజలకు యోగాపై అవగాహన కల్పించారు. నిరంతరం యోగా చేయడం ద్వారా మనిసి తన శరీరంపై కొన్ని నియమాలతో, అనారోగ్య సమస్యలు తలెత్తకుండా సంరక్షించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి వద్దే నిత్యం గంట సేపు యోగా నియమాలు తప్పనిసరిగా పాటించడం శ్రేయస్కరమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అప్పలరాజు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకరమైన సమాజం

కోటనందూరు: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగా కీలకపాత్ర పోషిస్తుందని తహసీల్దార్ సుభాష్, ఎంపీడీఓ నారాయణ, ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం కోటనందూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండు సెంటర్ వరకూ గురువారం యోగాంధ్రాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై నినాదాలు చేశారు. అనంతరం ఓ కళ్యాణ మండపంలో యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఓ దినచర్యగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ జయరాం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



తుని అమ్మాజీపేట సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ భువన సుందరి

తుని: ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో సచివాలయ ఉద్యోగులు శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని సీతారాంపురం, అమ్మాజీపేటకు చెందిన సచివాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. కౌన్సిలర్లు వాసంశెట్టి శ్రీనివాస్, బుద్దిగ దారేష్, డి.శ్రీనివాసరాజు, అద్దేపల్లి బాలాజీ పాల్గొన్నారు.

మెయిన్స్ పరీక్షా కేంద్రాల పరిశీలన

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య కళాశాలలో జరగనున్న మెయిన్స్ పరీక్షా కేంద్రాలను గురువారం పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష చివరి రాత పరీక్షలు జూన్ 1న జరగనున్నాయని అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. ఉదయం 10.గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయన్నారు. ఆయన వెంట సీఐ వై.ఆర్కే శ్రీనివాస్, ఎస్సై యువి శివ నాగబాబు, యూనివర్సిటీ ప్రో వైస్ చాన్సలర్, ఎగ్జామ్స్ కో–ఆర్డీనేటర్ ఆదిరెడ్డి రమేష్, తదితరులు ఉన్నారు.



ఆదిత్య కళాశాలలో పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీహరి రాజు

పోలీసుల తనిఖీలు



వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న ఎస్సై నాగబాబు

గండేపల్లి: మండల పరిధిలోని జెడ్.రాగంపేట ఆదిత్య ఆసుపత్రి సమీపంలోని సర్వీస్ రోడ్డులో గురువారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించినట్లు ఎస్సై .యువి శివ నాగబాబు తెలిపారు. ద్విచక్ర వాహనదారుడి రికార్డుల పరిశీలనతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. తాగి వాహనాలు నడిపితే కేసు నమోదు చేసి కోర్టుకు తరలించనున్నట్లు తెలియజేశారు. వాహనాలకు సంబంధించి రికార్డులు ఉండాలని, హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీలో నాలుగు రోజులుగా కాంట్రాక్ట్ అధ్యాపకులు చేపట్టిన నిరసనకు తెరపడింది. వర్సిటీ అధికారులు సర్వీస్ రెన్యూవల్ పేరుతో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలకు తాము హాజరుకావంటూ నిరసన తెలిపారు. ఎట్టకేలకు గురువారం మధ్యాహ్నం అధికారులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, లేనిపక్షంలో ప్రత్యామ్నాయం చూస్తామని తెలపడంతో డిపార్టుమెంట్ల వారీగా ఆయా అధ్యాపకులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

ధ్యానోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



ధ్యానోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముదునూరి మురళీకృష్ణరాజు తదితరులు

ప్రత్తిపాడు రూరల్ : ప్రత్తిపాడులో జూన్ 2 నుంచి మూడు రోజుల పాటు శ్రీరామచంద్రమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ధ్యానోత్సవం పోస్టర్లను వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ఆవిష్కరించారు. గురువారం ఆయన స్వగ్రామం ధర్మవరంలో శ్రీ రామ చంద్రమిషన్ ప్రతినిధులు మురళీరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మురళీరాజు మాట్లాడుతూ ధ్యానంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకురుతుందని, ఈ ధ్యానోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముదునూరి సీతారామరాజు, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, కోలా వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి గంగరావు, రామకుర్తి రాజబాబు, సిద్దపు రెడ్డి కాశి, పోకనాటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.